

"రాజారావు సీరియస్, స్టార్ట్ ఇమీడియట్లీ—
జగన్నాథం."

ఒక్కసారిగా ప్రసాద్ కంగారుపడ్డాడు. చేతిలో టెలిగ్రామ్ కాగితం పట్టుకుని అటూ ఇటూ చూసి, "సుజాతా" అంటూ ఆదుర్దాగా పిలిచాడు.

సుజాత ఏమిటనెంగుతో చేతులు తుడుచుకుంటూ ప్రసాద్ దగ్గరికి వచ్చింది.


"సుజాతా, నాన్నకు సీరియస్‌గా ఉందిట. ఇదిగో టెలిగ్రాం, వెళదాం పద. బట్టలు సర్దు" అన్నాడు.

సుజాత మాట్లాడకుండా అన్నయ్యకేసి చూస్తూ ఉండిపోయింది.

ప్రసాద్ సుజాత ప్రవర్తనకు ఆశ్చర్యపోతూ, "అదేమిటే, ఇంకా అలాగే ఉన్నావు? నాన్నకు అంత ప్రమాదంగా ఉంటే? తొందరగా బట్టలు అవీ సర్దు" అన్నాడు చెల్లెలు ముఖంలోకి చూస్తూ.

సుజాత అప్పటికీ మాట్లాడకుండా తలవంచుకుని, "నేను రాను. నువ్వెళ్ళిరా" అని గబగబా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ప్రసాద్ చెల్లెలు స్థితికి నిశ్చేష్టుడై నిలుచుండిపోయాడు. ఆమె సరాసరి పెరటిదొడ్లో నూతిగట్టు మీద కూర్చుని ఏమో చూస్తూ ఏదో ఆలోచిస్తూంది. ప్రసాద్ మారీ దగ్గరికి వెళ్ళి చెల్లెల్ని ఏదో అడుగుదామనుకున్నాడు. ఆమెను చూడగానే ఏమీ అడగలేక వెనక్కి వెళ్ళిపోయాడు.



ప్రసాద్ సూట్ కేస్‌లో బట్టలు సర్దుకుంటున్నాడు. సుజాత మెల్లిగా గదిలోకి వచ్చి, "అన్నయ్యా!" అంది.

ప్రసాద్ చెల్లెల్ని చూసి ఆశ్చర్య పోయాడు. ఆమె కను కొలకుల్లో నీళ్లు నిలిచాయి. మొహంలో తత్తరపాటు స్పష్టంగా కనిపిస్తూంది.

"నీతో నేనుకూడా వస్తున్నాను. నా బట్టలు కూడా సర్దు" అంది.

బట్టలు సర్దడంలో మునిగిపోయాడు ప్రసాద్.

*　*

అది చిన్న రైల్వేస్టేషను, ప్లాట్‌ఫారమ్ మీద నలుగురైదుగురు ప్రయాణీకులున్నారు. వాళ్ళు తలో స్తంభాన్నీ ఆనుకుని నిలుచున్నారు. పోర్టరు ఓ మూలగా నిద్రపోతున్నాడు.

రైలు వచ్చి ప్లాట్‌ఫారమ్ మీద ఆగింది. అంత పెద్ద రైల్లోనించి ఇద్దరంటే ఇద్దరే ఆ స్టేషనులో దిగారు.

ఆకాశాన నల్లటి మేఘాలు గర్జిస్తున్నాయి. మధ్య మధ్య కళ్ళు మిరుమిట్లు గొలిపేలా మెరుపులు. హోరున ఈదరగాలి. వాళ్లిద్దరూ ప్లాట్‌ఫారమ్‌మీదే కాసేపు తారట్లాడారు. ఈ వర్షంలో, ఇంత చీకటిలో ఊళ్లోకి ఎల్లా వెళ్లడమా అని తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

"మూడుమైళ్ళు వెళ్లాలి, ఎలా అన్నయ్యా? అక్కడ వారికి ఎలా ఉందో?" పొడిఆరిన గొంతుతో వర్షంలోకి చూస్తూ అంది సుజాత.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. వర్షం తగ్గే సూచనలు కనిపించడంలేదు."

"ఎవరైనా బండి కడితే?..."

"ఈ వర్షంలో ఎవరు కడతారు?"

"ఆయనెలా ఉన్నారో?" ఆదుర్దాతో మళ్లీ అన్నది.

ప్రసాద్ మాట్లాడలేదు!

"ఈ వర్షాన్ని చూస్తూంటే మనల్ని ఇక్కడే ఉంచేట్టుంది!" అన్నది భయంగా.

అప్పటికీ ప్రసాద్ మాట్లాడలేదు!

సుజాత ఈ తడవ కొంచెం బిగ్గరగా అన్నది: "ఏమైతే అయింది, నడిచే వెడదాం."

అతను సుజాతకేసి చూశాడు. ఆమె నిలువునా భయంచేత వణికిపోతూంది. అతను తల తిప్పుకున్నాడు. కాస్సేపాగి, "దారి బాగుండదు, గోతులూ, బురదానూ!" అన్నాడు.

సుజాత మాట్లాడలేదు.

కాలం మందంగా గడుస్తూంది.

ప్రసాద్ ఆలోచిస్తున్నాడు. క్షణాలు గడిచాయి.

"సరే, పద. తడిస్తే తడిశాం. అవతల మనిషికి ఎలా ఉందో?" అని వర్షంలోకి ప్రవేశాడు అతను.

సుజాత అన్నయ్యని అనుసరించింది.

•　•　•

ప్రసాద్, సుజాత పూర్తిగా తడిసిపోయారు. చలికి కొంచెం వణుకుతున్నారు. ఇద్దరూ వరండాలోకి వచ్చి నిలుచున్నారు. ఆ ఇంట్లో అలికిడి ఏమాత్రం లేదు ఈదురుగాలి శబ్దంతప్ప అంతా నిశ్శబ్దం. తలుపు కొట్టారు. వరండాలో లైటు వెలిగింది. నౌకరు వచ్చి తలుపు తీశాడు. వచ్చినవాళ్లని గుర్తుపట్టి, "రండి, బాబూ" అని లోపలికి దారి తీశాడు.

"ఎలా ఉంది, రంగన్నా?" అడిగాడు ప్రసాద్.

"ఫరవాలేదండి. కాస్త నయమే."

సుజాత తడిసిన తలనించి నీటిబిందువులు జారసాగాయి. ఆమె పమిట నిండుగా కప్పుకుని ఉంది. మాట్లాడకుండా గదిలోకి వెళ్లిపోయింది. కాస్సేపటికి పొడిబట్టలు కట్టుకుని మరో గదిలోకి వెళ్లింది.

ఆ గదిలో బెడ్‌లైట్ వెలుగుతూంది. మంచం మీద రాజారావు పడుకుని ఉన్నాడు. పక్కన కుర్చీలో ప్రసాద్ కూర్చుని రోగివంక చూస్తున్నాడు. ప్రసాద్ చెల్లెలు రావడం చూసి, "నువ్విక్కడే కూర్చో. నేను మళ్లీ వస్తాను" అని లేచాడు.

సుజాతకు ఏంచెయ్యాలో తోచలేదు. గది అంతా ఒకసారి కలయజూసి రోగివంక చూసింది. అతను నిద్ర పోతున్నాడు. సుజాత కిటికీ దగ్గిరికి వెళ్లి తెరిచి బయటికి చూసింది. ఆకాశం, చెట్లు మొత్తం చీకటిముద్దలా ఉంది. వర్షం పడుతూనే ఉంది. కాని కనిపించడం లేదు. చలిగాలి వీస్తూ ఆలోచనలు రాకుండా చేస్తూంది.

---

**నందశ్రీ**

---

ఎక్కడో ఓ మెరుపు. వెంటనే ఉరుము. బలంగా గాలి వీచింది. వర్షపు జల్లు సుజాతమీద పడింది. సుజాత ఉలిక్కిపడి ముఖం తుడుచుకుని కిటికీ తలుపులు వేసి మంచం దగ్గిరికి వచ్చింది.

రాజారావు ఇంకా లేవలేదు. సుజాత కుర్చీలో కూర్చుంది. ఏవేవో ఆలోచించసాగింది. గతించిన దుఃఖపూరిత సంఘటనలన్నీ ఒకటొకటిగా శిలగా ఆమెను కదిలించసాగాయి. సుజాతకు తెలియకుండానే కన్నీరు చెంపలమీదుగా జారసాగింది. రాజారావు బాధగా మూలిగి ఇటువైపు ఒత్తిగిలి పడుకున్నాడు. కుర్చీలో ఎవరో కునికిపాట్లు పడుతూఉండడం చూసి, "ఎవరూ?" అన్నాడు హీనస్వరంతో.

సుజాత కంగారుగా మొహం తుడుచుకుని లేచి నిలుచుంది. గాజులు ఘల్లుమన్నాయి. అప్పటికి ఆ వ్యక్తి ఎవరో గ్రహించిన రాజారావు, "నువ్వా, ఇక్కడికెందుకు వచ్చావు? ఇప్పుడు చూడడానికి వచ్చావా? ముందు ఇక్కడినించి పో" అన్నాడు కోపంగా, అంత నిస్సత్తువ లోను, బలహీనతలోనూ.

సుజాత తల దించేసుకుంది!

"పెళ్లిగ్రాఫ్ ఇచ్చింది నేనుకాదు. నాకు తెలికుండానే జగన్నాథం ఇచ్చాడు." అభిమానంతో అన్నాడు.

అప్పటికీ సుజాత మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయింది.

రాజారావు ఆయాస పడుతూ మరో పక్కకు తిరిగాడు.

క్షణాలు గడుస్తున్నాయి.

ధనధన కిటికీ తలుపులు కొట్టుకుని తెరుచుకున్నాయి. వర్షపు చినుకులు గదిలో పడసాగాయి. సుజాత కిటికీ తలుపులు వేసివచ్చి భర్త కాళ్లదగ్గిర కూర్చుంది. గదిలో నిశ్శబ్దంగా ఉన్నా వారిద్దరి హృదయాల్లోను అలజడి, ఆందోళన, భయం!

కాలం గడవనట్టే గడుస్తూంది.

"సుజాతా!"

ఆమె ఆ పిలుపుతో ఉలిక్కిపడింది.

రాజారావు ఆమె ముఖంలోకి చూస్తూ, "సుజాతా, నాకు దాహంగా ఉంది. కాసిని మంచి నీళ్లు తీసుకురా!" అన్నాడు ప్రేమగా.

ఆమె లోపలికి వెళ్లి మంచినీళ్లు తీసుకువచ్చి భర్త చేత తాగించింది,

రాజారావు సుజాతను చూసి దీర్ఘంగా నిశ్వసించాడు.

*　*　*

రెండురోజులు గడిచాయి.

రాజారావుకు ఏమాత్రం తగ్గలేదు. సుజాత పగలూ, రాత్రి మంచందగ్గిరే ఉండి సపర్యలు చేస్తూంది. డాక్టర్ సలహామీద పట్నం తీసుకు వచ్చి హాస్పిటల్లో చేర్పారు.

పడుకున్న రాజారావు కళ్లతో వార్డుఅంతా కలయజూశాడు. అనేక వ్యాధులతో పీడింపబడుతూ బాధ పడుతున్న రోగులందరూ అక్కడే ఉన్నారు. అందులో తనూ ఒకడు.

'చావును జయించేందుకు చక్కటి మందు కని పెడితే బాగుండును. ఈ ఆలోచన రాగానే మెల్లిగా తనలో తనే నవ్వుకున్నాడు. అతని చూపు తనపక్క ఉన్న బెడ్‌మీదికి మళ్లింది. ఆ బెడ్‌మీద ఉన్న వ్యక్తి తనవంక చాలా వింతగా చూస్తున్నట్టు గ్రహించాడు రాజారావు.

"ఏ ఊరు మీది?" అని అడిగాడు రాజారావు.

ఆ వ్యక్తి ఒకసారి కదిలి, "ఏమంటున్నారు?" అన్నాడు.

"మీ ఊరు?"

"నందమూరు" అని చిరునవ్వుతో, "మీ గురించి చెప్పండి" అన్నాడు.

రాజారావు తన ఊరూ, పేరూ చెప్పాడు.

"నా పేరు చలపతిరావు. నెలరోజులనించి 'స్టమక్ పెయిన్'తో బాధపడుతున్నాను" అన్నాడు అవతలి వ్యక్తి.

"మీరు నన్నెక్కడైనా చూశారా?" రాజారావు అడిగాడు.

"ఎక్కడా చూసినట్టు జ్ఞాపకంలేదు" అని కాస్సేపాగి, "మిమ్మల్ని చూస్తూంటే జాలేస్తూంది, మాస్టారూ" అని నిట్టూర్చాడు చలపతిరావు.

అతను అన్న మాటకు రాజారావు ఉలిక్కిపడి, "ఆదేమిటి. అలా అంటున్నారు?" అన్నాడు.

చలపతిరావు వేదాంతిలా నవ్వాడు. అంతలోనే గంభీరంగా మారి 'చెప్పనా వద్దా' అంటూ ఆలోచించ సాగాడు.

రాజారావుకీ ఆలస్యం నచ్చలేదు.

చివరికి చలపతిరావు అన్నాడు: "మీరున్న బెడ్ మీద ఒకే నెల్లో ఇద్దరు చనిపోయారు. వచ్చేటప్పుడు ఇద్దరూ రాళ్ళముక్కల్లా వచ్చారు. పదిరోజులు తిరక్కముందే మొరడులైపోయారు. రెండో ఆయన వారంరోజుల్లో పోయాడనుకుంటాను. ఆ బెడ్ ఎవరికీ అచ్చిరాలేదు! ఏమిటో, మాస్టారూ, అనుకుంటామే గానీ, ఏ క్షణం ఎవరిదో చెప్పలేంకదా!" అని నిట్టూర్చి మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు:

"ఈ చావుబ్రతుకులు మన చేతిలో ఉంటే దేవుడి మొహాన్న మట్టికొట్టేవాళ్ళము. అందుకే ఆ మహాను భావుడు ఇన్ని లీలలు చేస్తూంటాడు" అని రెండు చేతులు ఎత్తి నమస్కరించాడు.

అతను చెప్పిన ఉపన్యాసాన్ని గురించి ఆలోచిస్తున్నాడు రాజారావు.

కొన్ని క్షణాలు గడిచాయి.

"మాస్టారూ, నమ్మదగ్గ నిజం ఈ ప్రపంచంలో ఒక్కటే ఉంది. అది చావు. ఇది అందరికీ తెలుసు. ఇప్పుడు మనకు మందులిస్తున్న డాక్టరు రేపు ఉండక పోవచ్చు. దురదృష్టంకొద్దీ రాత్రికి రాత్రే భూమి కంపించి ఈ భవనంకాస్తా కూలి మనందరం కలిసి కట్టుగా చావనూవచ్చు. లేదా నేనొక్కణ్ణే చావచ్చు. ఏమంటారు?" చివర పకపకా నవ్వేశాడు చలపతిరావు.

రాజారావు నిట్టూర్చాడు.

"ఏమిటోనండి, చావు తలుచుకుంటూఉంటే భయంగా ఉంది. భార్యని, పిల్లల్ని, స్నేహితుల్ని, సుఖాల్ని వదిలిపోవాలంటే దిగులుగానూ ఉంది. మనిషి చిరంజీవి అయితే ఎంత బాగుండును! వీటన్నింటినీ తలుచుకుంటూంటే అసలు నిద్ర పట్టదు. ఎన్ని జబ్బులు వస్తేమట్టుకు ఏమిటండీ, ఆరోజు రావాలి గాని పోవడానికి! ఏజబ్బూ లేకుండా పోయినవాళ్ళు ఎంతమంది లేరు? మీకెందుకు, రాజారావుగారూ, దిగులుపెట్టుకోకండి. తప్పకుండా నయమవుతుంది. సారీ, ఏమిటేమిటో మాట్లాడేశానండి. చాలా పొద్దు పోయింది, పడుకోండి" అని చలపతిరావు మరోపక్కకు ఒత్తిగిలి పడుకున్నాడు.

ఆ వ్యక్తి ఇదంతా ఎందుకు చెప్పాడో రాజారావుకు అర్థం కాలేదు! చనిపోయిన ఇద్దరు వ్యక్తుల్ని తలుచుకుని వణికిపోయాడు. కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాడు. ఆ మరునటిరోజే చలపతిరావు హఠాత్తుగా చని పోయాడు. ఆ సమయంలో రాజారావుకు చివరిసారిగా చలపతిరావు అన్న మాట గుర్తుకువచ్చింది. 'నేనొక్కణ్ణే చావచ్చు!'

మానవులచేత తెలికుండానే నిజానిజాలు పలికిస్తూ ఉంటాడు భగవంతుడు. చలపతిరావు మాట తలుచుకుంటే ఇది నిజమనిపించింది.

చనిపోయిన చలపతిరావును బెడ్‌మీదనించి తీసుకు వెడుతూఉండగా వార్డులో అందరూ దిగులుగా


# వుడ్‌వార్డ్సతో

## మీ శిశువును ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి

వుడ్‌వార్డ్స, కుట్టునొప్పి, పుల్లధనం, కడుపు ఉబ్బరం, పళ్ల చేయునపుడు కలిగే జబ్బులకు తక్షణ నివారణ కలిగించును. వుడ్‌వార్డ్స గ్రైప్ వాటర్‌ను సర్వదా సిద్ధంగా వుంచుకోండి!




తెలివైన తల్లులు 100 ఏళ్లకు పైగా వాడుచున్నారు.

LPE Aiyars. F. 10 TL

చూస్తూ ఉండిపోయారు. ఆ దృశ్యం చూస్తూండగా ఎవరి మనస్సులో ఏ విధంగా అనుకున్నారో!

'రేపునేను చనిపోయిన తరవాతకూడా ఇంతే కదా!'— తనచావు తలుచుకుని రాజారావు గజగజ వణికిపోయాడు. ఇంకా ఆలోచించడానికి ధైర్యం లేకపోయింది.

రాత్రి వార్డు నిశ్శబ్దంగా ఉంది. కొద్దిగా చలిగాలి వీస్తూంది. బయట వెన్నెల లేతగా కిటికీల్లోంచి వస్తూంది.

రేపు తనకు ఆపరేషను!

అతను ఆలోచనలు గజిబిజిగా, గందరగోళంగా, అయోమయంగా, భయంగా ఉన్నాయి. మరోపక్క ఆశతో బ్రతికి బాగుంటే తన బంగారుకలలు!— వీటిమధ్య రాజారావు నలిగిపోతున్నాడు.

'నాకేమిటి, నేను రాజాలాగా బ్రతికాను. జీవితంలో అనుభవించవలిసిన సుఖాలన్నీ అనుభవించాను. నన్నూ, నా వైభవాన్నీ చూసి అందరూ ఈర్ష్యపడ్డారు. సుఖసంతోషాలమధ్య తుళ్లి తిరిగాను. ప్రపంచంలో సుఖాలన్నీ నా పరమైనాయి. సుఖజీవి ఎవరు? అనే ప్రశ్నకు బదులు నేను! జీవితం, హోదా — అన్నీ ఓహో అనుకున్నాను. కలసి వచ్చాయి. కాని ... సుజాతను పెళ్లి చేసుకున్నాను. పెళ్లి చేసుకున్న రోజునుంచి ఒక్క క్షణంకూడా ఆమెను సంతోషంతో, ఆనందంతో దగ్గిరికి చేరదీసిన రోజు లేదు. అయినా, సుజాత ఎప్పుడూ నవ్వుతూ, అందంగా కనిపించేది. ఆమె హృదయంలో ఎంత ఓర్పు, సహనం ఉందో ఎవరికీ తెలీదు!

స్త్రీగా, భార్యగా ఎన్నో విషయాలు చెప్పేది. అప్పట్లో సుజాతను అర్థం చేసుకోలేకపోయాను. హింసపెట్టాను. స్త్రీ సహనశీలతకు నిదర్శనం సుజాత. ఈనాడు ఆమెను తెలుసుకోగలిగాను. నేను ఈ చావునుండీ బయటపడగలిగితే సుజాతను క్షమాపణ కోరి, నూతన దాంపత్యాన్ని ప్రారంభిస్తాను. సుజాత నన్ను క్షమిస్తుంది. కాదనదు. ఒకవేళ ఆమె గాజులు, నుదుట బొట్టు . . . భగవాన్, కాదు! కాకూడదు! ఏమో? ఎవరు చెప్పగలరు? నిన్న ఉన్న చలపతిరావు ఈరోజు లేడు. అతను పోతాడని ఎవరైనా అనుకున్నారా? రేపు నేనూ? . . . చావుకు అర్థం ఏమిటి? చావుకీ బ్రతుక్కీ ఎంతదూరం? దూరం లేదు. నేను చనిపోయాక ఏం జరుగుతుంది? సుజాత ఒంటరి దవుతుంది. కాదు. కాదు . . . చాలామంది అయ్యో, పాపం! అనుకుంటారు. సుజాత ఈ దుఃఖాన్ని భరించ గలదా? తరవాత ఆమె జీవితం ఎలా ఉంటుంది? వీటికి సమాధానం లేదు. అయినా, సుజాత జీవితాన్ని మరోదిశకు ప్రయాణించేటట్టు చూడాలి. అది నా విధి; కర్తవ్యం. నా పాపాలకు ఆమెను . . .'

జీవితానికి సంబంధించిన తీవ్రాలోచనంతో అతని మనస్సంతా అల్లకల్లోలమైపోయింది. సుజాతను తలుచుకుంటే భయం వేస్తూంది. హృదయం ఆర్ద్రతతో నిండిపోతూంది.

తిరిగే పంకా నీడలు అతడిమీద నల్లగా, మృత్యువులా పడుతున్నాయి. శరీరమంతా చెమటలు పోశాయి. ఆలోచించడానికీ, గతాన్ని గుర్తుతెచ్చుకోడానికీ తనలో శక్తి లేదు. స్థిరనిశ్చయంకోసం రాజారావు తపన చెందుతున్నాడు.

రాజారావును స్ట్రెచ్చర్‌మీద పడుకోబెట్టారు. ఇంక కాస్సేపట్లో ఆపరేషన్ థియేటర్‌లో ఉంటాడు. అతను ఉదాసీనంగా పడుకున్నాడు. సుజాతకు ఎన్నో సంగతులు చెప్పాలనుకుంటున్నాడు. చెప్పలేడు! అదే తన బాధ! ఈ చివరిఘడియల్లో సుజాత తననీ, తన మనసునీ అర్థంచేసుకుంటే చాలు. తను ఏమైనా పరవాలేదు. తను కోరేదే అది.

సుజాత స్ట్రెచ్చర్‌మీద చెయ్యివేసి ఒక పక్కగా నుంచునిఉంది. పమిటచెంగు నిండుగా కప్పుకునిఉంది. ఆమె యోగినిలా, నిర్వికల్పంగా, అన్నింటినీ భరించగల స్త్రీమూర్తిలా ఉంది. రాజారావు సుజాత ముఖంలోకి చూశాడు. అకస్మాత్తుగా అతని స్థితి దారుణంగా మారిపోయింది.

కలవరపాటుతో 'సుజాతా' అన్నాడు.

సుజాత భర్త తల నిమురుతూ తల వంచుకుని ఉంది. ఆమె చెయ్యి తన చేతిలోకి తీసుకుని హృదయానికి హత్తుకున్నాడు.

నర్స్ వచ్చి టైమ్ కావస్తూందని చెప్పి వెళ్లిపోయింది.

ప్రసాద్ ఎక్కడినించో రాజారావు దగ్గిరికి వచ్చి "బావా" అన్నాడు సగద్గదంగా.

అన్నయ్యను చూసి సుజాత అక్కడనించి వెళ్లిపోయింది నెమ్మదిగా.

"ప్రసాద్, నేను బ్రతుకుతానో లేదో తెలీదు. మీకు చేసిన అన్యాయానికి భగవంతుడుకూడా నన్ను క్షమించడు. నేను పాపాత్ముణ్ణి. మీ ముఖం చూసే అర్హతకూడా నాకు లేదు" అని కాస్సేపాగి "నా ఆస్తి అంతా సుజాతపేర వ్రాశాను. సుజాత నన్ను క్షమిస్తే నిశ్చింతగా కళ్లు మూస్తాను" అన్నాడు.

"ఇప్పుడు ఆస్తి విషయాలన్నీ ఎందుకు బావా? నీకు తప్పకుండా నయమవుతుంది. దిగులు పడకు."

రాజారావు పేలవంగా నవ్వి, చూపు మారుస్తూ అన్నాడు: "అది వట్టి పిచ్చి నమ్మకం, ప్రసాద్. జబ్బు ముదిరిన తరవాత ఇంకా నయమవుతుందా?"

"అటువంటి మాటలనకు, బావా!"

"ప్రసాద్, నా ఆవేదన ఒక్కటే — సుజాత బ్రతుకునుగూర్చి. నా అంత్యదశలో నువ్వు నాకో మాట ఇవ్వాలి."

ప్రసాద్‌కు ఏమీ అర్థంకాక, "ఏమిటి, బావా?" అన్నాడు.

"నేను సుజాతను క్రూరంగా హింసించాను. అందుకే నాకీ అవస్థ. ఆమెకు నిండా ఇరవై సంవత్సరాలు నిండలేదు. జీవితమంటే ఏమిటో తెలీదు." రాజారావు ఆగిపోయాడు.

పైకప్పుకేసి కొన్ని క్షణాలుచూసి, "థియేటర్‌లోకి వెడుతున్నాను. మళ్లీ వస్తానో రానో ఖచ్చితంగా చెప్పలేను. తిరిగివస్తే సుజాతతో ఎలా గడపాలో నాకు తెలుసు. నా కర్మంకాలి రాలేకపోతే సుజాత దిక్కుమాలినది కాకూడదు. ఆమెకు చక్కటి వరుణ్ణి చూసే బాధ్యత నీది. ఆశ్చర్యపడకు. సుజాత లక్షాధికారిణి, డబ్బుకు చాలా విలవ ఉంటుంది. ఈ కోరిక సఫలమైతే ఆత్మశాంతి నాకు. ఆమెకు పెళ్లి చెయ్యండి. సుజాత జీవితం కన్నీళ్ళతో గడపటానికి వీల్లేదు" అన్నాడు.



Bensons SCL 7398 TEL




చర్మ శుభ్రతకు

నిక్సోడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, నాజూకుగాను శుభ్రపడునని గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎఱ్ఱని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మపురంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మ వ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, నాజూకుగాను శుభ్రము చేయు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనుడి.

ఋతుక్రమం ఆలస్యమైతే?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన 'దేవిపిల్సు' వాడండి



Mfrs:- SEENU & CO., MADRAS-21

పెద్ద కెమిస్టులు, డ్రగ్గిస్టులు అందరి వద్దను లభిస్తున్నది

'చక్కెర' కలువని తియ్యని పానీయములు




స్పెన్సర్ వారి

ఆరెంజ్

జింజర్

లెమన్

కోలా

'సాక్రిన్' కూడా కలువనివి

అఖిలిండియా డయబెటిక్

అసోసియేషన్

వారిచే ఆమోదింపబడినవి.

రాజారావు అభిప్రాయం విని ప్రసాద్ తెల్ల బోయాడు.

స్ట్రెచ్చర్‌తో రాజారావు లోపలికి వెళ్ళాడు.

తలుపులు మూసుకున్నాయి.

ఆ తరవాత రాజారావు ఎవరికీ కనిపించలేదు.

• • •

స్త్రీని పురుషుడు హింసించడమనేది వింటూ ఉంటాం. ఒక్కోసమయంలో దానికి హద్దులుండవు. స్త్రీలంటే నాకు అపారమైన సానుభూతి ఉంది. రాజారావు సుజాతను ఏవిధంగా, ఎంత నికృష్టంగా చిత్రహింసలుపెట్టిందీ నేను చెప్పలేను. సుజాత పడిన కష్టాలు ఎవరికీ రాకూడదనిమాత్రం కోరుకుంటున్నాను.

• • •

అప్పుడప్పుడే చీకట్లు ఆవరించుకుంటున్నాయి.

ఆ ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. గదిలో దీపం వెలిగించి ఫొటోదగ్గిర అవనతవదనంతో కళ్ళు మూసుకుని నిశ్చల ధ్యానముద్రతో నిలుచుంది సుజాత.

ప్రసాద్ లోపలికి అడుగుపెట్టబోయి ఆమెను చూసి ఆగిపోయాడు. క్షణంలో అతని మొహం మారి పోయింది. చెల్లెల్ని ఆ స్థితిలో చూడగానే తెలీ కుండానే కళ్ళు చెమర్చాయి. ఇరవైఏళ్ళు నిండని సుజాత బ్రతుకు చీకటి అయింది! చెల్లెలి దీనవదనం, చూపులు, జీవితంమీద విరక్తి అతణ్ణి ఎక్కడెక్కడికో తీసుకెడుతున్నాయి. నుదుట బొట్టు, ఆభరణాలు, తల్లో పూలు—ఏ ఒక్కటీ లేని ఇవన్నీ చూసి హృదయం కోటికంఠాలతో బావురుమని ఆక్రోశిస్తూంది.

తను ఏదో చెయ్యాలి.

చెయ్యాలి! ఇదే అతని నిరంతరమయిన ఆరాటం. ఆమెను మళ్ళీ ఒక ఇంటిదాన్ని చెయ్యాలి.

ముందు తను ఎదుర్కోబోయే సమస్యలు, విమర్శలు అన్నీ ఆలోచించాడు. ఒక నిర్ణయానికి వచ్చాడు. ఆ నిర్ణయానికీ, ఆశయానికీ అడ్డు లేదు. చనిపోయే ముందు బావ అన్న మాటలు అతణ్ణి కలిచివేస్తున్నాయి.

"చెల్లీ" అన్నాడు ఎలాగో.

సుజాత చెంగుతో కళ్ళు ఒత్తుకుంటూ ఇటు తిరిగింది.

ప్రసాద్ దగ్గిరికి వచ్చి, "చూడు,సుజాతా. ఎప్పుడూ ఇలా బాధపడితే ఎలా చెప్పు? లోకంలో ఎంతమంది చనిపోవడంలేదు? పోయినవారు మళ్ళీ వస్తారా? విలపించి ఏం ప్రయోజనం? రానురాను నీ స్థితి ఏ స్థితికి వస్తుందో గ్రహించావా?" అన్నాడు.

సుజాత మాట్లాడకుండా అన్నయ్య మొహం చూసి తల దించుకుంది.

"రెండేళ్ళక్రితం నా స్నేహితుడి అక్కయ్య రాజ్యం భర్త పోయాడు. రెండురోజులు అంతా విచారించారు. ఆ తరవాత ఆమెకు చక్కటి సంబంధం చూశారు. యోగ్యుడయిన, అందమైనవాడికిచ్చి పెళ్ళి చేశారు. ఇప్పుడు వారిద్దరు ఎంతో అన్యోన్యంగా, సంతోషంగా ఉంటున్నారు. మొన్ననే వారికో పాప కూడా పుట్టిందిట. భర్త పోయాడని రాజ్యం ఏడుస్తూ కూర్చుందా? హాయిగా పెళ్లి చేసుకుంది. కాపరం

చేస్తోంది. నా మాట విని నువ్వుకూడా . . ."

"అన్నయ్యా!" అంది సుజాత గద్గదంతో చలించి పోతూ.

"నీ విచారం నాకు తెలుసు, సుజాతా. కాని, తప్పదు. నిన్ను మంచి ప్రయోజకుడికిచ్చి పెళ్లి చేస్తాను. నిజం" అని గబగబా చెల్లెలు సమాధానంకోసంకూడా విన కుండా వెళ్లిపోయాడు.

• • •

ప్రసాద్ స్నేహితుడు భాస్కరం. ఇద్దరూ కాలేజీలో కలిసిమెలిసి చదివారు. భాస్కరం ఆశలు, ఊహలు వేరు. చదువుకునేరోజుల్లో ప్రతి చర్చలోను పాల్గొనేవాడు. సాంఘికాభ్యుదయం, నాగరికత, స్త్రీ విద్య, వరకట్ననిషేధం, పునర్వివాహం — సీటిమీద ఎప్పుడూ ఉపన్యాసాలు ఇస్తూ ఉండేవాడు. అతని వాగ్ధోరణికి అందరూ ఆశ్చర్యపోతూ ఉండేవారు.

"భాస్కరంలాటి వ్యక్తులు కొంతమంది ఉంటే చాలు" అంటూండేవారు.

భాస్కరం సెలవుల్లో ప్రసాద్‌కు ఉత్తరాల్లో ఇలాగ వ్రాస్తూండేవాడు:

"స్త్రీలకు మనం సరిఅయిన న్యాయాన్ని చేకూర్చాలి. వారూ మనలాటివారే. వారి ఒక్కొక్క కన్నీటి బొట్టు ఎన్నో శాపనార్థాలు. ప్రసాద్, మనం ఈ ప్రపంచంలోకి కొన్ని పనులు నిర్వర్తించడానికి వచ్చాం. వాటిని అర్థం చేసుకుని ముందుకు సాగిపోతూ ఉండాలి. ఎన్నో చిక్కులు అడుగడుగునా వస్తూ ఉంటాయి. వాటిని ధైర్యంతో, పట్టుదలతో విడదీసుకుంటూ పోవాలి. గమ్యం సుగమంగా ఉంటుంది. మన పాత్ర సరిగా నిర్వర్తించినవారమవుతాము ఈ విషయాలన్నీ ఎందుకు వ్రాశానో నీకు అర్థమయ్యే ఉంటుంది. ప్రత్యేకించి చెప్పవలిసిన అవసరం ఉండదను కుంటాను."

భాస్కరాన్ని ఎరిగి ఉన్న ప్రసాద్ వస్తున్నట్లు ఆశతో టెలిగ్రాం ఇచ్చాడు.

• • •

అది పెదన రైల్వేస్టేషన్. ఫర్లాంగు దూరంవరకూ చిన్నచిన్న రాళ్లతో కప్పబడిన ప్రదేశం. దారి పొడుగునా ఎర్రటి గన్నేరుపూలు. ప్రయాణికులు కూర్చో డానికి అనువుగా అక్కడక్కడ సిమెంటు బెంచీలు. కుడిచేతివైపున పెద్ద రావిచెట్టు. చెట్టుపక్కనే చిన్న పార్కు.

ఆ రావిచెట్టుకింద నుంచుని రైలు కోసం ఎదురు చూస్తున్నాడు భాస్కరం. వాచీ చూసుకున్నాడు. రైలు వచ్చే టైమ్ కావచ్చింది. ఆలోచిస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాడు. రైలుకూత. కాసేపట్లో ట్రెయిన్ స్టేషన్లో ఆగింది. భాస్కరం గబగబా కంపార్ట్‌మెంట్ దగ్గిరికి వెళ్లాడు. ప్రసాద్ నవ్వుతూ దిగాడు.

"ఇంత తొందరలో నిన్ను కలుస్తాననుకోలేదు!"

"నేనూ అనుకోలేదు. స్నేహితుణ్ణి చూడాలని ఈమాత్రమైనా దయ కలిగింది. సంతోషం."

ఇద్దరూ నవ్వుకున్నారు.

ఆనాటి కాలేజీ విషయాలు మాట్లాడుకుంటూ ఇల్లు చేరుకున్నారు. భోజనాలు చేసి వంతెనమీదికి వెళ్లి కూర్చున్నారు.

ప్రసాద్‌కు తను వచ్చిన విషయం ఎలా తెలియ జెయ్యాలో, ఎలా ప్రారంభించాలో తెలీడంలేదు. అయినా చెప్పక తప్పదు. తను చెప్పవలిసిన మాటలు మనస్సులో కూడబలుక్కుంటున్నాడు. చివరికి ఎలాగో "భాస్కరం" అన్నాడు.

భాస్కరం తల ఎత్తాడు.

"నీతో ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను."

"చెప్పు?"

". . . . . . . . . . . . . . . . . . ."

"సందేహిస్తావెందుకు?"

"ఆ విషయం విన్న తరవాత నన్ను అపార్థం చేసుకోవద్దు."

"నిన్నా? అపార్థం చేసుకోవడమా?"

"లేదు, భాస్కరం. చెప్పిన తరవాత నన్ను స్వార్థపరుణ్ణిగా ఎత్తిపొడిస్తే సహించలేను."

"చెప్పు. పరవాలేదు. అందులో నామునదా?"

ఇంతవరకూ మాట్లాడగలిగిన ప్రసాద్ ఇక మాట్లాడలేకపోయాడు. తికమక పడపోగాడు.

కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

"భాస్కరం, ఈమధ్య మా చెల్లెలు సుజాత భర్త పోయాడు. సుజాతకు మళ్లీ పెళ్లి చెయ్యాలని నా ప్రయత్నం."

"విష్ యూ బెస్టాఫ్‌లక్. మీ చెల్లెలు విషయంలో ఇటువంటి అభిప్రాయం తీసుకున్నందుకు నిన్ను అభి నందించకుండా ఉండలేకపోతున్నాను."

ప్రసాద్‌కి కొంచెం ధైర్యం వచ్చింది.

"రాజారావు ఆస్తి అంతా సుజాతపేరనే వ్రాశాడు. ఆమెకు చక్కటి వరుణ్ణి . . ."

"సుజాతను చేసుకున్నవాడు అదృష్టవంతుడు. ఆమెకు అన్నీ ఉన్నాయి — అందం, చదువు, గుణం, ఆస్తి. ఇంకా కావలిసింది ఏముంది? కళ్లు మూసుకుని చేసుకోవచ్చు!"

"నువ్వన్నది నిజమే, భాస్కరం. మా చెల్లెలు ఉత్తమ స్త్రీ. ఆమెకు తగినవాణ్ణే చూసి చెయ్యాలి."

"ష్యూర్. తప్పకుండా. నా చేతనైన సహాయం నేను చెయ్యగలను." ప్రసాద్ భుజం తట్టుతూ అన్నాడు.

ప్రసాద్‌కు ఎక్కడలేని ధైర్యం, సంతోషం వచ్చాయి.

"మా చెల్లెల్ని నువ్వు చేసుకుంటావనే ఆశతో వచ్చాను, భాస్కరం. మనం చదువుకునేటప్పుడు నువ్విచ్చిన ఉపన్యాసాలు, వ్రాసిన ఉత్తరాల్లో మాటలు నా మనస్సులో నిలిచిపోయాయి. నా మాట కాదనవనే నమ్మకంతోనూ, నీ ఆశయాలను ఆచరించడంలో నిలబడతావనే ధైర్యంతోనూ వచ్చాను."

భాస్కరం మాట్లాడకుండా చేతితో మొహం తుడుచుకొన్నాడు.

"సారీ, ప్రసాద్. మనిద్దరిలోను ఇటువంటి పెళ్లి ప్రసక్తి వస్తుందనుకోలేదు. సుజాతను చేసుకోలేను. నన్ను క్షమించు. అపార్థం చేసుకోవద్దు."

"నువ్వు చదువుకునేరోజుల్లో ఎన్నో చెప్పావాడివి. అవన్నీ. . ."

"చదువుకునేరోజులు వేరు. ఇప్పుడు వేరు. అప్పట్లో ఏదో చెయ్యాలనే ఆరాటంతప్ప వెనకా ముందూ ఆలోచించే సమయం కాదు. ఆ ఉద్రేకం వేరు. కలల జీవితం వేరు! నిజ జీవితం వేరు!"

"అంటే?" అయోమయంగా అడిగాడు.

"చూడు, ప్రసాద్. జీవితాన్ని ఎటుబడితే అటు తిప్పడానికి అది బొమ్మ కాదు. కోర్కెల పుట్ట జీవితం. చూస్తూ చూస్తూ ఒక విధవను పెళ్లి చేసుకోడానికి అంగీకరించడం అంత తేలికయిన పని కాదు. సుజాతను పెళ్లి చేసుకునేటంతటి త్యాగం నాలో లేదు" అన్నాడు.

కాసేపాగి తిరిగి భాస్కరం అన్నాడు:

"ప్రసాద్, నీకో సంఘటన చెబుతాను విను. ఇందిర అనే యువతి ఉంది. చదువుకునేరోజుల్లో ఎవరినో నమ్మి మోసపోయింది. రేపో మాపో తల్లి కాబోతూంది. అతను పారిపోయాడు. ఆమెను లోకం వెలివేసింది. చెప్పు, నువ్వామెను పెళ్లి చేసుకోగలవా? ఇలా సూటిగా అడుగుతున్నానని ఏమీ అనుకోకు!"

"చేసుకోలేను!"

"ఎందుకని?"

ప్రసాద్ మాట్లాడలేదు!

"నువ్వు ఏ ఉద్దేశంచేత ఆమెను పెళ్లి చేసుకో డానికి ఇష్టపడడంలేదో నాకు తెలుసు. అంత తెగింపు నువలోలేదు. ఇందిర ఎవరోకాదు నా చెల్లెలు" అన్నాడు భాస్కరం.

"ఈ సంగతి ఇంతవరకూ నాకు తెలీదు."

> అసంతృప్తి ఆత్మావలంబన రాహిత్యానికి సూచకం. చిత్త అస్థిరతకు చిహ్నం.
> —ఎమర్సన్

"చెప్పవలిసిన అవసరం రాలేదు. చెప్పలేదు. ప్రసాద్, ఒక్క విషయం గుర్తుంచుకో. ఈ స్వల్పవిషయాలతో మనిద్దరిమధ్యా స్నేహం తెగిపోవడం నాకు ఇష్టంలేదు. మనం స్నేహితులుగా ఉందాం. అప్పుడప్పుడూ ఇటువంటి అవాంతరాలు వస్తూఉంటాయి. బాధపడ కూడదు. మనస్సులో నువ్వేమీ పెట్టుకోకు. పద, చాలా పొద్దుపోయింది" అని లేచాడు భాస్కరం.

• • •

ప్రసాద్ ట్రెయిన్ ఎక్కాడు. భాస్కరంపక్కనే నుంచున్నాడు.

"ప్రసాద్, రాత్రి నీకో అబద్ధం చెప్పాను" అన్నాడు.

ప్రసాద్ తల ఎత్తి భాస్కరంకేసి చూశాడు.

"రాత్రి నిన్ను పరీక్షిద్దామని నాటకం ఆడాను. ఇందిర నాకేమీ కాదు. ఇందిర నా చెల్లెలుగా కల్పించి చెప్పాను. ఏమీ అనుకోకు. వెళ్లగానే ఉత్తరం వ్రాయి" అన్నాడు.

ప్రసాద్ తల ఊపాడు.

ట్రెయిన్ కూతతో ముందుకు కదిలింది.

• • •

ప్రసాద్ ఇంటికి వచ్చాడు. సుజాత గదిదగ్గిరికి వెళ్లి, "సుజాతా, సుజాతా! . . ." అంటూ తలుపు తట్టాడు.

లోపల గడియ వేసిఉంది. నిద్రపోతూందేమో అనుకున్నాడు. ఎంత పిలిచినా సమాధానంలేదు. కిటికీ రెక్కలు తెరిచి లోపలికి తొంగిచూశాడు.

నిశ్చేష్టుడయ్యాడు!

సుజాత ఎందుకు ఉరిపోసుకుందో ఎవరికీ తెలీదు! ★